
స్వామి వారిని దర్శించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు


చిక్కడపల్లి ఆలయంలో మాజీ సీఎం టి.అంజయ్య మనువడు అభిషేక్‌రెడ్డి

ముక్కోటి.. భక్తకోటి!

- కిటకిటలాడిన చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం
- వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వైష్ణవ ఆలయాల్లో భక్తుల రద్దీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులందరు వెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకొని ఆనందంతో పరవసించిపోయారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, బీజేపీ నేత పూస రాజు దంపతులు, మాజీ కార్పొరేటర్, వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్ దంపతులతో పాటు పలువురు ఉన్నతాధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో...

అంబర్‌పేట: వైకుంఠ ఏకాదశి వేడుకలు అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తులు భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. నియోజకవర్గంలో వైష్ణవ ఆలయాలు భక్తులతో కళకళాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.


డీడీ కాలనీ అహోబిలం మఠంలో స్వామివారిని దర్శించుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి


బీజేపీ సీనియర్ నేత నైషదం సత్యనారాయణమూర్తి


వైకుంఠ ద్వారంలో కొలువైన స్వామి వారు


గోల్నాకలో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్


శ్రీవారిని దర్శించుకున్న బీజేపీ నేత గౌతంరావు తదితరులు


న్యూనల్లకుంటలో ఉత్సవ విగ్రహాలకు హారతి ఇస్తున్న దృశ్యం


స్వామి వారిని దర్శించుకున్న బీజేపీ నేత పూస రాజు


ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్


పంచముఖి లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులు


వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నేడు ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: మెడికోర్ హాస్పిటల్స్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8:30 నుంచి 12 గంటల వరకు ఉప్పల్, పీర్జాదిగూడ, పర్వతాపూర్‌లోని శ్రీ సాయి ఐశ్వర్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు బ్రాంచ్ మేనేజర్ వినోద్, బ్రాంచ్ హెడ్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, బాడీ మాస్ ఇండెక్స్, ఈసీజీ, ఐ చెకప్, డెంటల్ చెకప్ ఉంటుందని, ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు సెల్: 8125547092లో సంప్రదించాలని సూచించారు.

అసెంబ్లీ స్పీకర్‌కు శుభాకాంక్షలు



నల్లకుంట: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పలువురు టీపీసీసీ సీనియర్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. టీపీసీసీ సీనియర్ నాయకులు కేపీ మురళీకృష్ణ, కత్తుల సుదర్శన్, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి కుతాడి రవి కుమార్, ఆర్.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

కాచిగూడ: బర్కత్‌పుర భూమన్న లేన్‌లో నూతనంగా చేపడుతున్న సీవరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం జలమండలి అధికారులతో కలిసి పైప్‌లైన్ నిర్మాణపు పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, మల్లికార్జున్, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'గురుదత్త'లో ఘనంగా సెమీ క్రిస్మస్



నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ గురుదత్త ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. నాలుగో తరగతి విద్యార్థి దూసరి లోకేష్ గౌడ్ శాంతాక్లాస్ (క్రిస్మస్ తాత) వేషధారణలో ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో శ్రీ గురుదత్త విద్యా సంస్థల చైర్మన్ వై.శర్మ, కరస్పాండెంట్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయురాలు ఫ్లోరిన్ సుగంధి, అర్చన, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: బోడుప్పల్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కూర బాలరాజు, గోకుల సత్యనారాయణ, నాగుల లింగమూర్తి, రాజేశ్వర్, జగన్నాథం, రాజేందర్, పాక శ్రీనివాస్, పూస యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం


క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఏసు ప్రభు బోధనలు అనుసరణీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాంనగర్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏసు ప్రభు చూపిన మార్గంలో నడుచుకుంటూ ప్రతి ఒక్కరూ శాంతి స్థాపనకు పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు జననం నాటకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీ శ్యాంసన్, మోజెస్, శ్యామ్యూల్, ప్రకాష్, శ్రీధర్ రెడ్డి, గిడియన్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కు సుబ్బారెడ్డికి నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తొలితరం విప్లవ నేత ముక్కు సుబ్బారెడ్డి (రంగన్న) సంస్మరణ సభ శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం ఫర్ సోషల్ ఛేంజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముక్కు సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కొడపల్లి సీతారామయ్య స్మారక కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలు, కర్షకులు, కార్మికుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి ముక్కు సుబ్బారెడ్డి అన్నారు. ఆయన భౌతికంగా లేకపోయిన ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. ప్రజలతో మమేకమై అనేక మంది పోరాట యోధులుగా తయారు చేసిన గొప్ప వ్యక్తి ముక్కు సుబ్బారెడ్డి అని కొనియాడారు. ఫోరం ఫర్ సోషల్ చెంజ్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ముక్కు సుబ్బారెడ్డి సహచరులు సి.హెచ్.కాంచనరావు, మాజీ మావోయిస్టు జంపన్న తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారీదారుల అరెస్టు

ముషీరాబాద్: కల్తీ మద్యం తయారు చేస్తున్న ఇద్దరిని ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ సమాచారం మేరకు... తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన ఎర్నాల్డ్ మిల్స్(50), వృత్తిరీత్యా డ్రైవర్, గెరాల్డిన్(54) గృహిణి ఇద్దరూ అక్కా తమ్ముడు గత కొన్ని రోజులుగా వారి ఇంట్లో గుట్టుచప్పుడుకాకుండా కల్తీ మద్యం తయారీ చేస్తూ రహస్యంగా విక్రయిస్తున్నారు. ఇంట్లోనే వివిధ రకాల పండ్లను నిల్వ ఉంచి వైన్‌ను తయారు చేసి లీటగర్ బాటిల్స్‌లో ప్యాక్ చేసి ఒక్కొక్క బాటిల్ రూ. 350 చొప్పున విక్రయిస్తున్నారు. మల్‌బరీ, గ్రేప్స్ తదితర ఫ్రూట్స్‌తో తయారు చేసిన వైన్స్ విక్రయిస్తున్నారు. శుభకార్యాలు, పండుగలు, వచ్చాయంటే వీరి వ్యాపారం జోరుగా సాగుతుంది. వారి ఇంట్లో 360 బాటిల్స్‌లో నిల్వ చేసిన వైన్‌ను ఎక్సైజ్ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. వైన్ తయారు చేసి విక్రయిస్తున్న ఎర్నాల్డ్ మిల్స్ గెరాల్డిన్‌ను అరెస్టు చేశారు. దాడిలో ముషీరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐలు రమేష్‌బాబు, నాగలక్ష్మి, కానిస్టేబుల్స్ వివేక్, హైమ, ఖదీర్, ధనలక్ష్మి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి: ఆర్.కృష్ణయ్య


కాచిగూడలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతంకు పెంచాలన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టులు కులాల వారి లెక్కలు ఉంటే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల మాదిరిగా కుల గణన చేపట్టాలని అన్నారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతంకు పెంచడానికి కులాల వారి లెక్కలు అవసరమని ఆయన పేర్కొన్నారు. బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి గ్రూపులుగా వర్గీకరించడానికి కులాల వారి జనాభా లెక్కలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, నంద గోపాల్, సుధాకర్, కోట్ల శ్రీనివాస్, కరుణశ్రీ, కోటేశ్వరీ, మధుసూధన్, పృథ్వీరాజ్, బలరామ్, లడ్డూ పటేల్, కమలాకర్ పాల్గొన్నారు.

గత పాలకుల తీరుతో నిరుద్యోగ యువతకు అన్యాయం



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న పోటీ పరీక్షల అభ్యర్థులు



ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థిని

కవాడిగూడ: జూనియర్ లెక్చరర్ పాలిటెక్నిక్ లెక్చరర్ గ్రూప్–4 ఏఈఈ పరీక్షల ఫలితాలను వెంటనే ప్రకటించి హారిజాంటల్ రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిరుద్యోగ అభ్యర్థులు శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వాద్ద శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులు గురుమేష్, అఖిల్‌సాయి, తేజ, శ్వేత మాట్లాడుతూ... ఉద్యోగాల భర్తీ విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యధోరణితో నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించకుండా టీఎస్పీఎస్సీ చేత నిర్వహించబడిన వివిధ రకాల పరీక్షల అన్ని కూడా ఒక్కొక్కటి ఒక్కో దశలో ఆగిపోయి ఉన్నాయని, వీటిపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ తమిళ్ సై జోక్యం చేసుకోని ఇంకా నిర్వహించని పరీక్షలకు తేదీలను ప్రకటించి టీఎస్పీఎస్సీ కొత్త బోర్డును ఏర్పాటు చేసి ఉద్యోగ భర్తీ చేపట్టాలని కోరారు. ఎన్నికల హామీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఒక సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇలాంటి కోర్టు కేసులు లేకుండా హారిజాంటల్ రిజర్వేషన్ సమస్యను పరిష్కరించి దాని తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాలని లేకుంటే వారు భర్తీ చేయబోయే రెండు లక్షల ఉద్యోగాలు కూడా కోర్టు కేసుల్లో పడి ఆగిపోయే ప్రమాదం ఉందని ఈ విషయం ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్వేత, సాహితీ, నర్మద, రాజుకిషోర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి


జీహెచ్ఎంసీ సిబ్బందికి దుప్పట్లను పంపిణీ చేస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ దాయారం మార్కెట్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలని సూచించారు. పార్టీ నాయకులు పార్టీ అధిష్టానం ఆదేశించే కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్, కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, అంజియాదవ్, నాయకులు లింగం, ప్రవీణ్‌రెడ్డి, సురేష్‌కుమార్, రమేష్‌గౌడ్, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, మధు, మహేందర్, శరత్, శ్యామ్, శాంతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


అచ్చిని రమేష్

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ అడ్వైజరీ మెంబర్‌గా బాగ్‌అంబర్‌పేటకు చెందిన బీజేపీ నాయకులు అచ్చిని రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు గౌతంరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ల అందజేత

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్‌ల పోగొట్టుకున్న వారికి ఆ ఫోన్‌లను ట్రేస్ చేసి అందజేశారు. శనివారం సాయంత్రం స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోన్‌లు పోగొట్టుకున్న 14 మందికి అడ్మిన్ ఎస్ఐ నాగరాజు ఫోన్‌లను అందజేశారు. ఆయా ఫోన్‌లను ట్రేస్ చేయడంలో చాకచక్యంగా పనిచేసిన క్రైమ్ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

సంగీతంతో సంస్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంగీతం అనేది పిల్లల్లో సంస్కారాన్ని పెంపొందిస్తుందని... సంగీతాన్ని నేర్చుకోవడం వల్ల మంచి పౌరులుగా సమాజంలో గుర్తించబడతారని ప్రముఖ విద్యావేత్త, మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్ర మాట్లాడుతూ... మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తలమానికమని కొనియాడారు. సంగీతంతో పాటు సాహిత్యం, భరతనాట్యం లాంటి నృత్యాలు విద్యార్థుల్లో మంచి ప్రతిభను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో గౌరీభట్ల లక్ష్మణమూర్తి, వసుధామూర్తిలు సంగీతాన్ని అందించారు. కార్యక్రమంలో దూరదర్శన్ సీనియర్ యాంకర్ విజయదుర్గ, కర్ణాటక మ్యూజిక్ టీచర్ ప్రఖ్యాజయశ్రీ, ఐసీఈయూ జనరల్ సెక్రటరీ జి.తిరుపతయ్య, టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కామసెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం


రైతుల వేషాధరణలో విద్యార్థులు

అంబర్‌పేట: రైతు ప్రాధాన్యతను విద్యార్థులు చాటి చెప్పారు. శనివారం నారాయణ పాఠశాలలో నిర్వహించిన రైతు దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. రైతు దేశానికి వెన్నుముక వంటి సందేశాత్మక అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్, ప్రిన్సిపాల్ సరితా ఆగర్వాల్ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో నెం-46తో గ్రామీణ ప్రాంతాల

కానిస్టేబుల్ అభ్యర్థులకు తీరని నష్టం

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్


ధర్నా చేస్తున్న కానిస్టేబుల్ విద్యార్థుల పోరాట సమితి నాయకులు

కవాడిగూడ: గ్రామీణ ప్రాంత కానిస్టేబుల్ అభ్యర్థులకు జీవో నెంబర్ 46తో తీరని నష్టం జరుగుతుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ పేర్కొన్నారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద కానిస్టేబుల్ విద్యార్థుల పోరాట సమితి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత కానిస్టేబుల్ ఎంపిక విధానంలో జీవో నెంబర్-46ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీవో నెంబర్-46 అమలు చేసి పోస్టు కోడ్ నెంబర్-24 టిఎస్ ఎస్‌పి అనే ఐదు వేల స్టేట్ పోస్టులను జిల్లా పోస్టులుగా మార్చి 2011 జనాభా ప్రాతిపదికన ఈ జిల్లాకు ఎంత శాతం అంటూ విభజించి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు 53 శాతం పోస్టులను కేటాయించి నిజామాబాద్ రామగుండం వరంగల్ జిల్లాలకు ఎక్కువ మొత్తం పోస్టులు కేటాయించినట్లు తెలిపారు. కొన్ని పాత కొత్త జిల్లాలకు నిష్పత్తి ప్రకారం తప్పుపోస్టులను కేటాయించడం వలన తక్కువ పోస్టులు ఉన్న జిల్లాల కానిస్టేబుల్ అభ్యర్థులకు 125 పైగా మార్కులు వచ్చిన ఉద్యోగాలు రాలేదని, ఎక్కువ పోస్టులున్న జిల్లాలోని కానిస్టేబుల్ అభ్యర్థులకు 85 మార్కులు ఉన్న ఉద్యోగాలు వచ్చాయని ఈ గ్రామీణ ప్రాంత కానిస్టేబుల్ అభ్యర్థులకు తీరని నష్టమన్నారు. కానిస్టేబుల్ పరీక్షలో నాలుగు తప్పుడు ప్రశ్నలను తొలగించి రిజల్ట్ ఇవ్వమని హైకోర్టు తీర్పు ఇచ్చి కోర్టులో తీర్పు రిజర్వులో ఉండగా కానిస్టేబుల్ అభ్యర్థుల ప్రాంతాలను ఏ విధంగా ప్రకటిస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంత కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ విద్యార్థుల పోరాట సమితి నాయకులు అనిల్, హరీష్, మధు, వసంత్, వినోద్, ఆకాష్, ఉదయ్, నవీన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రమాదేవికి స్వరసురఝరి బిరుదు ప్రదానం


రమాదేవిని సన్మానించిన ప్రముఖులు

చిక్కడపల్లి: అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ అట్ హైదరాబాద్, కల్చరల్ అండ్ ఉమెన్ వింగ్‌ల సంయుక్తాధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం టీచర్ బాలాత్రిపురసుందరి, సంగీతం రమాదేవికి స్వరసురఝరి బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీ, భక్తి గీత విభావరి ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు వీవీ జనార్దన్‌రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు, ఉమెన్స్ వింగ్ కన్వీనర్ అనురాధ, ప్రతినిధులు అన్నపూర్ణ, రామ్‌గోపాల్, ప్రసాద్, రామారావు, యశోధర, జీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్వర గాయని గాయత్రి నారాయణ

చిక్కడపల్లి: స్వరంలో లాలిత్యత భాష ఉచ్ఛారణలో స్పష్టతతో గాయత్రి నారాయణ ఏ పాటనైనా అలవోకగా ఆలపించగలరని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం ప్రశంసించారు. శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవ వేడుకలు రంజకంగా శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగాయి. చిల్ల శివపార్వతి శిష్య బృందం పలు గానం చేసి శ్రోతలను రంజింపచేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యతిథిగా ఓలేటి పార్వతీశం పాల్గొని గాయని గాయత్రి నారాయణకు వాణీజయరాం జీవిత సాఫల్య పురస్కారం, సుస్వర మంజరి బిరుదును ప్రదానం చేశారు. సమాజ సేవకుడు చిల్ల రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించిన సభలో కళాపోషకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొని శివపార్వతిని, గాయత్రిని అభినందించారు.